ప్రజాశక్తి
సోమవారం 18 నవంబర్ 2024
5
విజయనగరం

## అయ్యకోనేరు పరిరక్షణకు సహకరించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యకోనేరును పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యకోనేరును అందంగా తీర్చిదిద్ది, ప్రజావసరాల కోసమే వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోనేరులో కొంతమంది పూజా సామగ్రిని, ఇతర నిరుపయోగ వస్తువులను పడేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇకనుండి ఏ ఒక్కరూ అటువంటి చర్యలకు ఉపక్రమించకూడదని తెలిపారు. చెత్తాచెదారాలు వేసిన వారిపట్ల ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని, వారిపై అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

---

# సమరోత్సాహం

*సమరోత్సాహం నడుమ సిపిఎం పదో జిల్లా మహాసభ ఆదివారం ముగిసింది. ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని, పాలక పార్టీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను అడ్డుకోవడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని అభిప్రాయపడింది. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రత్యేకించి సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా నిధులు కేటాయించాలని, పారిశ్రామిక రంగ వృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల మెరుగు తక్షణ చర్యలు తీసుకోవాలని, కార్మికులు, రైతులు, కౌలురైతులు, గిరిజనులు, దళితులు సమస్యలపై పోరాడాలని, మహిళలు అణచివేత, గృహ హింస, హత్యలు, అత్యాచారాల నివారణకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, ఉపాధి పనిదినాల పెంపు, పట్టణాలకు వర్తింపు, సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి, పట్టణ పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని నిర్ణయించింది. మొత్తంగా 10 అంశాలపై మహాసభలో ప్రతినిధులు ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.*

సిపిఎం జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు

- ముగిసిన సిపిఎం జిల్లా మహాసభ
- 10 అంశాలపై తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం
- జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / టౌన్

నగరంలోని అయ్యన్నపేట సమీపంలో గంట్యాడ రోడ్డులో ఉన్న కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (వెంకట్ సత్య కల్యాణ మండపం)లో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ ప్రాంగణంలో సిపిఎం విజయనగరం జిల్లా పదో మహాసభ శని, ఆదివారాల్లో జరిగింది. సభకు హాజరైన ప్రతినిధులంతా ప్రాంతాలు, రంగాల వారీగా గడిచిన మూడేళ్లలో చేపట్టిన ఉద్యమాలు, ఫలితాలు, నిర్మాణ అంశాలను చర్చించారు. వీటిపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను సభ స్థూలంగా ఆమోదించింది. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకున్నారు. జిల్లాలోని కీలక సమస్యలు, అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అవరోధాలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో రాజకీయ విధానం, భవిష్యత్తు పోరాట లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. పాలక పార్టీలు ప్రజల్ని పట్టించుకోకపోవడం వల్ల వారి జీవన స్థితిగతులు మెరుగు పడడం లేదని, వారికి అండగా నిలబడి ప్రభుత్వంపైన పోరాడటమే ప్రథమ కర్తవ్యంగా తీసుకోవాలని సభ అభిప్రాయపడింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద తేడా ఏమీ లేదని, నాడు బిజెపి చెప్పినట్టు వైసిపి వ్యవహరిస్తే, నేడు అదే బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను టిడిపి, జనసేన కూటమి అవలంబిస్తోందని సభ అభిప్రాయపడింది. మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ వామపక్షాల ఐక్య ఉద్యమాలతో దోపిడీ శక్తులను ఓడిస్తామన్నారు. దేశంలో ప్రతి రాజకీయ మార్పు వెనుక కమ్యూనిస్టుల కృషి ఉందన్నారు. నాడు వైసిపి, నేడు టిడిపి స్టీల్ ప్లాంట్ విషయంలో దొంగనాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. చట్ట సభల్లో అవకాశం లేని చోట్ల ప్రజాక్షేత్రంలో పోరాడుతున్నామని చెప్పారు.

### ఇవీ మహాసభలో తీర్మానాలు

- సాగుదారు హక్కు చట్టాన్ని సవరించి, ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలి. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలుదారులకు బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ రాయితీలు కల్పించాలి. నిబంధన తీసేసి గ్రామసభల్లో కౌలురైతులను గుర్తించి సిసిఆర్ కార్డులు జారీ చేయాలి.
- భూస్వాముల చేతుల్లోని ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని భూమిలేని ప్రతికుటుంబానికి కనీసం రెండెకరాలు పంపిణీ చేయాలి. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి. అసైన్డ్ భూ వివరాలను సచివాలయాల్లో పెట్టి వివరాలు అందించాలి.
- పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారమే నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి. పట్టాల్లేని సాగురైతుకు జిరాయితీ రైతులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలి. రైతులకు ఇస్తామన్న పెట్టుబడిసాయం రూ.20 వేలు తక్షణమే చెల్లించాలి.
- ఆప్కోస్‌తో సహా అన్ని శాఖల్లో అన్ని కేడర్ల ఉద్యోగులకు ఎంటిఎస్, సమాన పనికి సమాన వేతనం, డైరెక్ట్ పేమెంట్లను అమలు చేయడంతోపాటు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.
- మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింస, అత్యాచారాలను అరికట్టేందుకు, అందుకు కారణమౌతున్న మాదకద్రవ్యాలను, మద్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.
- జిఒ నెంబరు 3ను పునరుద్ధరించి, గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. మెజార్టీ గిరిజనులు ఉన్న గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలి, అటువంటి గ్రామాలకోసం ప్రత్యేక ఐటిడిఎ ఏర్పాటు చేయాలి.
- శ్రామిక మహిళలకు కనీస వేతన చట్టం అమలు చేయాలి, స్కీమ్‌వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
- గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి.
- ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.
- ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలి.

విప్లవ గేయాలను ఆలపిస్తున్న కళాకారులు

### నూతన కార్యదర్శిగా తమ్మినేని నాలుగోసారి ఎన్నిక / 14 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

తమ్మినేని సూర్యనారాయణ

సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి, పి.శంకరరావు తిరిగి ఎన్నికయ్యారు. దీనికి ముందు జిల్లా నూతన కమిటీ సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు. వీరంతా కలిసి జిల్లా కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులతోపాటు ఎ.జగన్మోహన్, జి.శ్రీనివాస్, గాడి అప్పారావు, పి.రమణమ్మ, కె.సురేష్, సిహెచ్ వెంకటేష్, విఆర్ గోపాల్, బి.రాంబాబు సహా మరొకరు ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం పర్యవేక్షణలో రెండు రోజుల మహాసభ, ఎన్నిక జరిగాయి.

రెడ్డి శంకరరావు

టివి రమణ

వి.లక్ష్మి

పొట్నూరు శంకరరావు

---

## యువకుడిపై పీడీ యాక్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, భౌతికదాడులకు పాల్పడుతూ, పలు కేసుల్లో నిందితుడిగా అరెస్టయిన బండి రాజీవ్ (డాడీ)పై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన యువకుడు రాజీవ్‌ను నిర్బంధించి, విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించామని ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజీవ్ వ్యసనాలకు అలవాటు పడి, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ, చిన్న విషయాలకే గొడవలు పడుతూ, భౌతిక దాడులకు దిగుతూ గత మూడేళ్లలో నగరంలోని మూడు స్టేషన్ల పరిధిలో 12 కేసుల్లో అరెస్టయినట్లు చెప్పారు. నేరాల నియంత్రణకు

### మూడేళ్లలో 12 కేసుల్లో నిందితుడు రాజీవ్

చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా బండి రాజీవ్‌పై పీడీ యాక్టును అమలు చేయాలని టుటౌన్ పోలీసులు ఎస్‌పి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. వాటిని సిఫార్సు చేస్తూ జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదనలు పంపామని ఎస్‌పి వెల్లడించారు. దీంతో రాజీవ్‌ను నిర్బంధించి, విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారినా ఉపేక్షించేది లేదని ఎస్‌పి హెచ్చరించారు.

ముత్యాలవాన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాసరావు, ఆర్.వాసుదేవరావు, కవులు

## ముత్యాలవాన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రముఖకవి రావిపల్లి వాసుదేవరావు రచించిన ముత్యాలవాన గేయాల పుస్తకాన్ని కవి కె.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం నగరంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాహితీ స్రవంతి, సరోజిని మహిళా మండలి ఆధ్వర్యంలో కవికాయక సమ్మేళనం, ముత్యాలవాన పుస్తక పరిచయం నిర్వహించారు. పలువురు కవులు మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై గళం వినిపించారు. కవి పాయల మురళీకృష్ణ ముత్యాల వాన పుస్తకాన్ని పరిచయం చేశారు.

కార్యక్రమంలో పుస్తక రచయిత రావిపల్లి వాసుదేవరావు, సాహితీ స్రవంతి ప్రతినిధులు చీకటి దివాకర్, చీకటి చంద్రికరాణి, శ్రీనివాసరావు, మురళి, కవులు దోసపాటి రామచంద్రరావు, మానాపురం రాజా చంద్రశేఖర్, బద్రి కూర్మారావు, కొంకిపూడి అనురాధ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సగం ధరలకే పుస్తకాలు

పుస్తకాలను విక్రయిస్తున్న గ్రంథాలయ సంఘ ప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి కూడలి వద్ద పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సగం ధరకే పుస్తకాల అమ్మకం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొత్తలి ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్ మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల ఆసక్తి తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు సంఘం తరపున నిరంతరం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు బి. రామభద్రరాజు, సాయిరెడ్డి, జి.ఎస్.చలం. సీతం కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, సంజయ్, వాకర్స్ క్లబ్ సభ్యులు శ్రీరామ్మూర్తి, సత్యం, చిరంజీవిరావు, జనార్దన్, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా ఎయిర్‌పోర్టు పనులు

నిర్మాణంలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ టవర్

- రన్‌వే 65 శాతం, టెర్మినల్ భవనం 40 శాతం పూర్తి
- ప్రారంభమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణం
- 2026 జూన్‌లో విమానాశ్రయ ప్రారంభోత్సమే లక్ష్యంగా పనులు

విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో నిర్మించిన విద్యుత్తు టవర్లు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 జూన్ నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉంది. అందుకు తగ్గట్టుగా పనులు పూర్తి చేసేందుకు ప్రతినెలా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమానాశ్రయ పనులను పరిశీలిస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారిపై ఉప్పాడపేట వద్దనున్న ట్రంపెట్ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు పనులు కూడా ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం ట్రంపెట్‌కి కిలోమీటరు దూరం నుంచి గూడెపువలస వరకు.. అనగా, విమానాశ్రయ టెర్మినల్ భవనం వరకు భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో అక్కడ వరకు రహదారి పనులు చేపడుతున్నారు. మరోవైపు విద్యుత్తు లైన్లు క్రాస్ చేసేందుకు ఇరువైపులా టవర్ల పనులు కూడా చేపడుతున్నారు.

### సగం పనులు పూర్తి

భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి సగం పనులు పూర్తయినట్లు ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. భూములను చదును చేసే మట్టి పనులు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి రెండు రన్‌వేలు నిర్మిస్తుండగా, ఇందులో ఒక రన్‌వేకి సంబంధించి 65శాతం పనులు చేపట్టారు. మరో వైపు టాక్సీవే పనులు కూడా 50శాతం పూర్తయ్యాయి. ప్రధానమైన టెర్మినల్ భవనం పనులు 40శాతం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ పనులు 45 శాతం పూర్తయ్యాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం కూడా వేగవంతం చేస్తుండడంతో అనుకున్న సమయానికి అప్పజెప్పేందుకు నిర్మాణ సంస్థ జిఎంఆర్ కూడా సమాయత్తమవుతోంది. బయట రాష్ట్రాల నుంచి కూలీలను భారీ ఎత్తున తీసుకొచ్చి రాత్రి, పగలు కూడా పనులు చేపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా నిర్మాణ సంస్థకు అవసరమైన సహాయ సహకారాలను కూడా పూర్తిస్థాయిలో అందిస్తోంది.

### ట్రిబ్యునల్ కోర్టులో పరిహారం

గూడెపువలస నుంచి కంచేరు వరకు భూమిని సేకరించినా, రైతులకు పరిహారం పూర్తిగా అందలేదు. కంచేరు, గూడెపువలస, ఎ.రావివలస రెవెన్యూ పరిధిలోని రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఎకరాకు రూ.90 లక్షలు చొప్పున ఇస్తామని గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు చెందిన ఓ నేత.. రైతుల్లో కొంతమంది చెప్పినట్లు తెలిసింది. కానీ అప్పటి రెవెన్యూ అధికారులు మాటమార్చారు. ఎకరాకు రూ.52 లక్షలు చొప్పున ఇస్తామని అప్పటి ఆర్‌డిఒ భవానీ శంకర్ ప్రకటించారు. దీనికి అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో విశాఖలోని భూసేకరణ ట్రిబ్యునల్ కోర్టులో గత ప్రభుత్వం జమ చేసింది. ఆ పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల బైరెడ్డిపాలెంలో పనులు ప్రారంభించినా, రైతులు అడ్డుకున్నారు.

పనులు అడ్డుకుంటున్న బైరెడ్డిపాలెం రైతులు

ఫాగింగ్ చేస్తున్న ఆటో

## దోమల నివారణకు ఫాగింగ్ ముమ్మరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ ప్రక్రియను ప్రజారోగ్య సిబ్బంది ముమ్మరం చేశారు. రోజుకొక డివిజన్‌లో ఫాగింగ్ యంత్రాలతో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ఫాగింగ్ చేస్తున్నారు. దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్లు చేపడుతున్నారు. కుంటలు, చెరువులు ఇతర నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటి లార్వా ఆపరేషన్ చేపడుతున్నారు.

## నేడు గ్రీవెన్స్ యథాతథం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రద్దు కావడంతో కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) యథాతథంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతి రూపంలో సమర్పించుకునేందుకు గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కుమిలి విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి

ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-15, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్ పోటీల్లో కుమిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 15 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు కమలనాభరావు అభినందించారు. రాష్ట్ర పోటీల్లో రాణించి సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

## దోస్త్ మేరా దోస్త్..

### 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1976 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 50ఏళ్ల తర్వాత ఒకచోట కలిశారు. ఆదివారం వీరి ఆత్మీయ కలయికకు స్థానిక ప్రభుత్వ పుణ్యగిరి డిగ్రీ కళాశాల వేదికగా మారింది. ఈ పూర్వ విద్యార్థులను బొండ వెంకటరమణమూర్తి, వసంత వెంకటరమణ, జిఎస్ఎన్ ప్రసాద్, నానిగిరి తులసీదాస్, రెడ్డి వెంకన్న, దొడ్డ నారాయణరావు, ఇంటి రమణ, కెవి రామచారి, రమేష్‌లు కలిసి ఒక్క చోట కలిపారు. అనంతరం 50 సంవత్సరాల తర్వాత కలిసిన వీళ్ళ ఒక్కసారిగా తమ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల రోజుల్లో ఎలా ఉండేవారు, ఎలాంటి పేర్లతో పిలుచుకునేవారు వారు చేసిన తుంటరి పనులు వంటివి చెప్పుకొని మురిసిపోయారు. ఆనాడు చదువుచెప్పిన గురువుల్లో ఉపాధ్యాయులతో తిన్న దెబ్బలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏం చేస్తున్నారు చెప్పుకున్నారు. తమ కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. 50 తర్వాత కలుసుకున్న వీరి ముఖంలో ఎంతో ఆనంద సంతోషం కనిపించింది. ఈ కలయిక తమలోని ఎంతో ఆనందం ఆత్మస్థైర్యం నింపిందని ఒకరికొకరు ఆలింగనం చేసుకొని చెప్పుకున్నారు. ఇలాగే తమ స్నేహబంధం నూరేళ్ళ కొనసాగాలని కోరుకున్నారు. తమను ఒకచోట కల్పిన పూర్వ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. పూర్వ విద్యార్థుల సందడితో ఆ ప్రాంతం ఎంతో సందడిగా మారింది. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

## ప్రజలకు అందుబాటులో లేకపోతే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ చాలా మంది సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయాలకు వెళ్లడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. అలా డ్యూటీ సమయాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఎక్కడినుండైనా ఫిర్యాదు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజాధనంతో వేతనాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయవలసిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతా రాహిత్యంగా భావించి చర్యలకు ఉపక్రమిస్తామన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాకారుడికి చేయూత

ప్రజాశక్తి - బొబ్బిలి

జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు శనపతి అశోక్‌కు జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు, ఎన్‌ఆర్‌ఐ అనిల్, గోపీభూషణ్ చేయూత అందించారు. అథ్లెటిక్ పోటీలలో రామభద్రపురం మండలం ముచ్చర్లవలసకు చెందిన అశోక్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచి రన్నింగ్ విభాగంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించాడు. జాతీయ స్థాయిలో జరగనున్న మరో ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికై కావడంతో జనసేన నేత బాబు పాలూరి ఆర్థిక సాయం చేయగా ఎన్.ఆర్.ఐలు అనిల్, గోపీభూషణ్ స్పోర్ట్స్ కిట్ అందజేశారు. జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి బొబ్బిలి ప్రాంతానికి మంచి ఖ్యాతి తీసుకు రావాలని అశోక్ ను కోరారు. కార్యక్రమంలో రామభద్రపురం జనసైనికులు సతీష్, జగదీష్, యుగంధర్, జనసేన వీరమహిళ వరలక్ష్మి పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే కేసులు

ప్రజాశక్తి - బొబ్బిలి

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికలు, బాలురకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన, ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి వెళ్లినా, వాహన అనుమతి పత్రాలు, బీమా లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## అప్పుడు వ్యతిరేకించి..ఇప్పుడెలా అనుమతిస్తారు?

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లకు ఎలా అనుమతిస్తారని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో వినియోగదారులకు నష్టం జరుగుతుందని, ప్రతిపక్షంలో టిడిపి వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంటింటి కొళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి ఆదేశాలు మేరకు ఇంటింటి కొళాయి పనులను 11,12 వార్డ్ మెంబర్లు మామిడి కృష్ణవేణి, అనకాపల్లి చెల్లయ్య, ఎంపిటిసి వాకాడ సింహాచలం ఆదివారం జెసిబి రోడ్డులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిడి వెంకటరమణ, వాకాడ రమణ, సరపల్లి సురేష్, ఆడారి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కలు

## పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ప్రధాన రహదారి ఆనందపురం నుంచి వేపాడ మీదుగా సోంపురం జంక్షన్ వరకు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలతో చెట్లు చేవుగా పెరిగి ఉండటం వల్ల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. సీతంపేట కల్లాల వద్ద ఒకవైపు రోడ్డు ఛిద్రమై ఉండటం మరో వైపు రోడ్డుకు ఇరువైపులా దట్టమైన పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి జంగిల్ తొలగించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రాయితీపై అపరాల విత్తనాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో ఈ రబీ సీజన్‌లో అపరాల సాగు కోసం మినుములు, పెసలు రాయితీపై రైతులకు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. 40 క్వింటాళ్ల మినుములు, 4 క్వింటాళ్ల పెసలు, 15 క్వింటాళ్ల కట్టె జనుములు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. 4 కేజీల మినుముల పేకెట్ రాయితీ పోను రూ.392లకు, 4 కేజీల పెసలు పేకెట్ రూ.368లు, 10 కేజీల కట్టె జనుము రూ.440లకు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

# తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- భోగాపురంలో వరుస దొంగతనాలు
- ఆరు రోజుల కిందట కొమ్మూరి వీధిలో, తాజాగా హైవే పక్కనే విశ్రాంత ఎస్ఐ ఇంట్లో చోరీలు

ప్రజాశక్తి - భోగాపురం

తాళాలు వేసి ఉన్న ఇళ్ళే లక్ష్యంగా భోగాపురంలో జరుగుతున్న వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. భోగాపురంలో ఇటీవలి జరిగిన బైక్ దొంగతనంతో సహా వరుస నాలుగు దొంగతనాలు జరగడంతో ప్రజలకు కంటి మీద కునుకు ఉండటం లేదు. ఈ దొంగతనాలన్నీ ఒకే ముఠా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో మూడు దొంగతనాలు జాతీయరహదారికి ఆనుకునే జరగడం విశేషం. భోగాపురం గ్రామంలో సాక్షాత్తు రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో శనివారం రాత్రి వెలుగు చూసిన చోరీతో పాటు నాలుగు రోజులు కిందట కొమ్మూరి వీధిలో ఒక దొంగతనం జరిగింది. ఈ నెల 15వ తేదీ రాత్రి ఇంటి ముందు పెట్టిన బైక్‌ను సైతం ఎత్తుకుపోయారు. మూడు నెలల కిందట కోత మిషను సమీపంలో కూడా హైవే పక్కనే పై అంతస్తులో తాళం వేసిన ఇంట్లో కూడా ఇదే విధంగా దొంగతనం జరిగింది. జాతీయరహదారికి ఆనుకొని, తాళాలు వేసే ఇళ్ళే లక్ష్యంగా పెట్టుకొని జరుగుతున్న దొంగతనాలకు ఒకే ముఠా కారణంగా ప్రజలు కూడా భావిస్తున్నారు. దీంతో ప్రజలు కొంత భయాందోళనలకు గురవుతున్నారు.

రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రిటైర్డ్ ఎస్ఐ ముద్దాన నారాయణరావుకు జాతీయ రహదారికి పక్కనే ఆనుకొని కిందన షాపులు పైన ఇళ్ళు ఉంది. ఇటీవలి వారం రోజులు కిందట హైదరాబాదులో ఉంటున్న కుమారుడు ఇంటికి వెళ్ళాడు. దొంగతనం ఎప్పుడు జరిగిందో తెలియదు కాని కింద షాపులో ఉంటున్న యజమాని గేట్లు తెరిచి ఉండడంతో పైకి వెళ్ళి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి వెంటనే నారాయణరావుకు సమాచారం ఇచ్చారు. లోపల ఉన్న మూడు బీరువాలను సైతం విరగ్గొట్టేశారు. కప్‌బోర్డులను ఏకంగా తెరిచేశారు. దీంతో వీరు దొంగతనాల్లో ఆరితేరిన ముఠాగానే పోలీసులు భావిస్తున్నారు. ఆరు రోజులు కిందట కొమ్మూరి వీధికి చెందిన కొమ్మూరి శారద కంటి ఆపరేషన్ నిమిత్తం ఇంటికి తాళం వేసి విశాఖపట్నం వెళ్ళారు. ఇంతలో తాళాలు విరగ్గొట్టి ఉండడంతో స్థానికులు ఆమెకు సమాచారం ఇవ్వడంతో వచ్చే చూసేసరికి పావు తక్కువ మూడు తులాలు బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమె ఒక పోలీసు అధికారికి సమీప బంధువు. ఈ నెల 15వ తేదీ రాత్రి జాతీయరహదారిని ఆనుకొని పాలకేంద్రం సమీపంలో ఇంట్లో ఆద్దెకు ఉంటున్న వ్యక్తి ఇంటి ముందు పెట్టిన పల్సర్ బైక్‌ను ఎత్తుకుపోయారు. ఈయన ముక్కాంలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. బైక్ పోయినట్లు బైక్ ఫోటోతో సహా సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరుగుతోంది. మూడు నెలలు కిందట కోత మిషను సమీపంలో జాతీయ రహదారికి పక్కనే పైఅంతస్తులో దొంగతనం జరిగింది. ఇక్కడ కూడా ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళినప్పుడే ఈ దొంగతనం జరిగింది.

**రెక్కి నిర్వహించే దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా**

ఈ వరసు దొంగతనాలకు పాల్పడుతున్నది ఒకే ముఠా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా తాళాలు వేసిన ఇళ్ళనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అంటే ముందుగా ఈ ముఠా గ్రామంలో పక్కాగా రెక్కి నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అందులోని తాళాలు వేసిన ఇళ్ళపై గురిపెడుతున్నారని స్థానికులు అంటున్నారు. అదికూడా జాతీయ రహదారికి ఆనుకొని ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అయితే తాజాగా జరిగిన బైక్ దొంగతనంతో కలిసి ఈ మూడు దొంగతనాలు ఒకే ముఠా చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

**దొంగతనాలు అరికట్టేందుకు నిఘా పెంచుతాం**

దొంగతనాలు అరికట్టేందుకు గ్రామాల్లో నిఘా పెంచుతాం. ఇప్పటికే రాత్రి వేళల్లో సిబ్బంది నైట్ రౌండ్స్ తిరుగుతున్నారు. క్యాంపులు వెళ్ళేవారు ఇంట్లో ఉన్న నగదు, బంగారం వంటివి బ్యాంకు లాకర్లో దాచుకుంటే మంచిది. క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించి నిందితులను పట్టుకుంటాం.

**ఎన్‌వి ప్రభాకర్, సి.ఐ భోగాపురం**

# విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

**ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి**

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలని ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె. విజయగౌరి అన్నారు. స్థానిక నోబుల్ స్కూల్లో ఆదివారం యుటిఎఫ్ మండలం, పట్టణ స్వర్ణోత్సవ మహాసభలు కార్యవర్గ సభ్యులు ఆనెం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సంస్కరణలు నేడు విద్యారంగానికి సవాళ్లుగా ఉన్నాయని, భవిష్యత్తులో ఉద్యమాలతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా విద్యా సంస్థలను క్లస్టరైజేషన్ చేయబోతున్న నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయించే కృషి పెరగాలన్నారు. 117 జిఒ రద్దు, నూతన పెన్షన్ విధానం రద్దు కోసం పోరాటాలు, బోధనకు ఆటంకంగా ఉండే బోధనేతర పనులు, యాప్‌ల భారం తగ్గించాలని, ఆర్థిక బకాయిలను భవిష్యత్తులో సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం కోసం కృషి చేద్దామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి, సౌకర్యాలు సాధనకు

బొబ్బిలి: మాట్లాడుతున్న విజయగౌరి

ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, కార్యదర్శి కేశవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యన్నారాయణ, మధుసూధనరావు, శ్రీనివాస్, రాధాకృష్ణ, స్వామినాయుడు, మహేష్‌లతో పాటు టీచర్లు పాల్గొన్నారు.

**పలువురు ఉపాధ్యాయులకు సత్కారం**

విద్యారంగంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులైన ఉషారాణి, రమేష్, ప్రసాద్, వెంకటరావు, పద్మావతి, మోసెస్, ప్రసన్నకుమార్‌లను ఘనంగా సత్కరించారు. కృష్ణదాసు, అప్పల నాయుడు, చంటి, కస్తూరి, శారదారాణి, కామేశ్వరులు పాల్గొన్నారు.

**పూసపాటిరేగ :** డెంకాడ మండలంలోని ఆర్ ముంగినాపల్లి వద్ద మామిడి తోటలో ఆదివారం యుటిఎఫ్ పూసపాటిరేగ మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా పి.వైకుంఠ రమణ, ప్రధాన కార్యదర్శిగా జి.గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.అప్పల నాయుడు, జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్, జిల్లా కార్యద ర్శులు ప్రసాద్, సూర్యారావులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు నీలకం ఠం, వెంకటరావు, అప్పలరాజు మాస్టర్లు, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాద్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసుతో గట్టు వెంకన్న

## నిర్బంధాలు అన్యాయం

ప్రజాశక్తి- వేపాడ

సమస్యలపై పోరాటానికి సిద్ధపడుతున్న తమను నిర్బంధించి ముందస్తు అరెస్టులు చేయడం అన్యాయమని ఎపి గ్రామ సహాయకుల సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న అన్నారు.మంగళగిరిలో జరగనున్న సామూహిక నిరసన కార్యక్రమానికి బయలుదేరుతున్న అతనిని మండలంలోని రామస్వామిపేట ఆయన స్వగృహంలో పోలీసులు ఆదివారం నిర్బందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఖరి పట్ల పట్ల రానున్న రోజుల్లో సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు.

# డబ్బులిస్తే గాని పనులు చేయరా..?

**సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం**

ప్రజాశక్తి - వంగర

తహశీల్దార్ కార్యాలయంలో ఏ సర్టిఫికెట్ అవసరం ఉన్నా అక్కడ అధికారులకు డబ్బులు చెల్లిస్తే గాని సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని, అందువల్ల పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపిపి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, సంగాం, గీతనాపల్లి, మగ్గూరు గ్రామాలకు చెందిన సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని, విఆర్ఒలు, మండల సర్వేయరు అందుబాటులో ఉండటం లేదని కరణం సుదర్శన్‌రావు, పోలిరెడ్డి రమేష్ సభ దృష్టికి తెచ్చారు. ఈ సభకు హాజరైన రెవెన్యూ శాఖ డిటి రామారావు మాట్లాడుతూ తాను కొత్తగా జాయిన్ అయ్యానని భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు కూడా ఉండటం లేదని ఎంపిపి తెలిపారు. విద్యాశాఖ చర్చలో ఎంఇఒ పనితీరు సక్రమంగా లేదని సభ్యులు ఆరోపించారు. మడ్డువలసకు చెందిన సర్పంచ్ ప్రతినిధి ఎంఇఒ పనితీరు సరిగా లేదని తెలపగా సభ్యులు కాని వారు సభలో

డిటిని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపిపి ఉమామహేశ్వరరావు

ఎలా మాట్లాడుతారని ఎంఇఒ బదులిచ్చారు. నాడు నేడు పనులకు సంబంధించి నాలుగు లక్షల రూపాయలు బిల్లులు రావాలని వెంటనే వాటిని చెల్లించాలని శివ్వాం సర్పంచ్ సభ దృష్టికి తెచ్చారు. మైనింగ్ అధికారులు సమావేశానికి రాకపోవడం ఏంటని సభలో సభ్యులు ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ త్రినాధరావు, ఇఒపిఆర్‌డి రామారావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# డాన్స్ పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

బాలికల దినోత్సవం సందర్భంగా శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన డాన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఆనందో బ్రహ్మ డాన్స్ అకాడమీ, శ్రీకళాభారతి కమిటీ ఆధ్వర్యంలో డాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 158 మంది చిన్నారులు పాల్గొని సినీ, జానపద గేయాలకు నృత్యం చేసి చూపర్లను ఆకట్టుకున్నారు. చిన్నారులలో ప్రతిభను వెలికి తీసేందుకు డాన్స్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని నిర్వహకులు ఎన్. వేణుగోపాల్, ఎం.విజయమోహన్ అన్నారు. విజేతల ఒదరికీ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను, ప్రశంస పత్రాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన నంబయార్ వేణుగోపాలరావు, చింత శారదలు అందించారు. న్యాయ నిర్ణేతలగా జి.కొండల రావు, వై.వాగ్దేవి, పి.లావణ్య, ఆనందోబ్రహ్మ అకాడమీ సభ్యులు బిజి గంగాధర్, రాముద్రి, భవాని, కమల్ కుమార్, సత్య, లక్ష్మీ వ్యవహరించారు. పోటీలలో ఆల్ రౌండర్ విభాగాల్లో అభ్యుదయ, శ్రీచైతన్య, శ్రీసూర్య, నోబుల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను సాధించారు.

విన్యాసాలు చేస్తున్న శ్రీనిధి పాఠశాల విద్యార్థులు

బాలల దినోత్సవం సందర్భంగా శ్రీనిధి పాఠశాలలో ఆదివారం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను వాసు విద్యా సంస్థల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, కరస్పాండెంట్ వాసుదేవరావు అభినందించారు.

# గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంచుకోవచ్చునని తెలుగు ఉపాధ్యాయులు ఎన్.ప్రియాంక అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాలు వల్ల కలిగే ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి స్వర్ణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: చిత్రలేఖనాలను చూపిస్తున్న చిన్నారులు

**డెంకాడ:** స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులలో ఆర్. వెంకటలక్ష్మి ప్రథమ, పి.నీలావతి ద్వితీయ, కె. ఇందుమతి తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నట్లు గ్రంథాలయాధికారి మహేష్ తెలిపారు.

**సంతకవిటి :** విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయాధికారి శ్రీదేవి అన్నారు. ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

**రామభద్రపురం:** గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని స్థానిక గ్రంథాలయాధికారి సత్యవాణి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక టిడిపి కార్యాలయంలో ఏపీ మార్క్ ఫెడ్ ఛైర్మన్, నియోజక వర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, పంచాది సూర్య నారాయణ, గురాన అసిరి నాయుడు, కాళ్ళ రాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బాడంగి:** మాజీ ఎమ్మెల్యే, సిఎం చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, బుడా ఛైర్మన్ తెంటు రాజా సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు ఉన్నారు.

**శృంగవరపుకోట:** మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు అకాల మరణానికి చింతిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఆమె భర్త కోళ్ల అప్పల రామ్ ప్రసాద్ రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**డెంకాడ:** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలు లేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : రామ్మూర్తినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**భోగాపురం :** నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. నాయకులు పిడుగు తోటరావు, దాసరి అప్పల స్వామి, ఎస్.మురళివర్మ, బొడ్డ హరిబాబు, లంక అప్పలనర్సయ్య, ఎరుసు అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం కోట:** స్థానిక అశోక్ బంగ్లాలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి టిడిపి నియోజకవర్గ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కొడుకు, కోడలు

# ఆటో బోల్తా పడి మహిళ మృతి

### మరో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై అమనాం బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట లక్ష్మి (44)అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. విశాఖపట్నం అక్కయ్యపాలెంకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు రాజాంలో బారసాల కార్యక్రమానికి ఆటోలో 9 మంది వెళ్తున్నారు. అమనాం వంతెన వద్ద కారును ఓవర్ టెక్ చేయబోయి వెనుక నుంచి ఢీ కొట్టి ఆటో బోల్తా పడింది. దీంతో తోట లక్ష్మి ప్రమాదం జరిగిన చోట చనిపోయింది. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ సూర్యకుమారి, హైవే సిబ్బంది వెంటనే గాయాలు పాలైన ఐదుగురు వ్యక్తుల్లో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకరిని సుందరపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన వారిలో మృతురాలి భర్త వెంకటరమణ, తోటి కోడలు సుజాత, అత్తయ్య తవిటమ్మ, మరో కుటుంబ సభ్యుడు సన్నీకి తీవ్ర గాయలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాలు ఘోరాలు

### పేకాట శిబిరంపై దాడి ..18మంది పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 18మందిని పట్టుకున్నారు. ఆదివారం ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధి కొండపేట, ఒమ్మి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నారు. కొండపేటలో 5వేలు, 11మంది, ఒమ్మిలో 4వేలు, 7గురుని పట్టుకున్నారు. కాగా ఎవరైనా పేకాట గ్రామాల్లో, ఇతర ప్రదేశాల్లో ఆడినట్లయితే 9121109444 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

**బొబ్బిలి:** మున్సిపాలిటీ పరిధిలో అప్పయ్యపేట శివారు రాణిగారి తోట వద్ద పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. తమకున్న ముందస్తు సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.30400 నగదు, 11 మొబైల్ ఫోన్‌లు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు.

## 27న బుడా ఛైర్మన్‌గా తెంటు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- బాడంగి

ఈ నెల 27వ తేదీన బుడా ఛైర్మన్‌గా తెంటు లక్ష్ముంనాయుడు ప్రమాణ స్వీకర కార్యక్రమం బొబ్బిలి బుడా ఆఫీస్‌లో జరగనుందని ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజారు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న 104 ఉద్యోగులు

## 104 ఉద్యోగులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

104 ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని ఉద్యోగులు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజా దనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.ఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఆర్.సన్యాసినాయుడు, ఎం. కృష్ణమరాజు, జి కోటరావు, కె సత్యనారాయణ, కె మోహన్, సతీష్, బి మాధవి, బి మహాలక్ష్మి, జి అప్పల సూర్యనారాయణ, కే శ్రీనివాస్, కె.నర్సింగరావు, డి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.